రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## ముగిసిన సిఎం కప్ 2023 క్రీడా పోటీలు

**కొడంగల్ రూరల్, మే 17 (ప్రభాతవార్త) :**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ 2023 క్రీడాపోటీలు బుధవారంతో ముగిశాయని ఎంపీడీవో పాండు తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన వాలీబాల్‌లో 8 జట్లు, కబడ్డీ పోటీల్లో 6 జట్లు, పరుగు పందెం 100 మీటర్లలో 12 మంది, 400 మీటర్ల పరుగు పందెంలో 6 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. వాలీబాల్, కబడ్డీ పోటీల్లో హస్నాబాద్ జట్లు గెలుపొందగా 100 మీటర్ల పరుగు పందెంలో కొడంగల్‌కు చెందిన సి.మనోజ్, 400 మీటర్ల పరుగు పందెంలో కే.కిరణ్ విజేతలుగా నిలిచారన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 22 నుంచి జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బహుమతులు, ప్రశాంస పత్రాలు అందించడం జరుగుతుందన్నారు.

## అదుపు తప్పి ధాన్యం లారీ బోల్తా


అదుపు తప్పి బోల్తాపడిన లారీ

**దౌల్తాబాద్, మే 17 ( ప్రభాతవార్త ):** వరి ధాన్యం లారీ బోల్తాపడిన సంఘటన దౌల్తాబాద్ మండలంలో బుధవారం జరిగింది. మండల పరిధిలోని గుమ్మాల గ్రామంలో రైతులకు సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత లారీలో తరలిస్తున్న క్రమంలో ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్‌ను తప్పించబోయి అదుపు తప్పి లారీ బోల్తాపడింది. లారీలో ఉన్న ఇద్దరు రైతులకు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

## బోగారం,తిమ్మాయిపల్లి గ్రామాలను సందర్శించిన అదనపు కలెక్టర్


బోగారం గ్రామంలో సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

**కీసర,మే17,ప్రభాతవార్త:**

మండలలోని బోగారం,తిమ్మాయిపల్లి గ్రామాలను జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య బుదవారం సందర్శించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సర్పంచ్‌కి సూచించారు.గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో చేయాలని అన్నారు.పనుల్లో నాణ్యత లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.గ్రామంలో మురుగు నీరు పోవడానికి అవుట్‌లెట్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని అందుకు సమస్య పరిష్కారం కావాలంటే వెంటనే రాగా జగన్‌మోహన్‌రెడ్డి బావి దగ్గర అండర్ గ్రౌండ్ డ్రేనేజీ వేయాలని అన్నారు.అనంతరం తిమ్మాయిపల్లి గ్రామంలో వైకుంఠధామం,నర్సరీని పరిశీలించారు.హరితహారం మొక్కల చుట్టూ చెత్త చెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సర్పంచ్‌కి సూచించారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ అధికారి పద్మజారాణి,సర్పంచ్‌లు సుంకరి కవిత జైహింద్‌రెడ్డి,పిడిశెట్టి పెంటయ్య,బోగారం ఉపసర్పంచ్ రాంశెట్టి జానకిరాం,ఎంపిటిసి సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా మండల స్థాయి క్రీడాపోటీలు

### -విజేతలకు బహుమతుల అందజేత

**ఘట్‌కేసర్, మే 17, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లో సీఎం కప్ మండల స్థాయి క్రీడాపోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. వాలీబాల్, ఖోఖో పోటీలు పూర్తికాగా బుధవారం కబడ్డీపోటీలను ఎంపిపి సుదర్శన్‌రెడ్డి విచ్చేసి ప్రారంభించారు. వాలీబాల్ మొదటి బహుమతి ఎదులాబాద్, రెండవ బహుమతి మర్రిపల్లిగూడ జట్లు గెలుచుకోగా ఖోఖో ఆటలో మొదటి బహుమతి అంకుషాపూర్, రెండో బహుమతి ప్రతాపసింగారం జట్లు పొందాయి. ఈసందర్భంగా ఎంపిపి వైఎస్ఆర్, ఎంపిడిఓ అరుణల చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందజేశారు. కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలలో క్రీడాకారులు ఉత్సహంగా పాల్గొంటున్నారు. మండలస్థాయిలో ఎంపికైన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనడానికి పంపిస్తారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ శశిధర్, గట్టగళ్ల రవి, ఎంపిటిసిలు కొమ్మిడి శోభారాణి, పులకంటి భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొమ్మిడి సత్యనారాయణరెడ్డి, పీడీ వినోద్ కుమార్, శ్రీరాములు, తిరుమల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కొమ్మిడి దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టి కృషితోనే సమాగ్రాభివృద్ధి

**-టియుఎఫ్ఐడిసి రూ.15కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
**-ఆమనగల్లు అభివృద్ధికి పెద్దపీట**
**-డివిజన్ కార్యాలయాలతో పూర్వ వైభవం**
**-ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్**


సురసముద్రం చెరువు కట్టపై విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్

**ఆమనగల్లు, మే17, ప్రభాతవార్త:**

పట్టణాలు, గ్రామాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందాలంటే సమిష్టి కృషి ఉంటేనే సాధ్యపడుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ సమాగ్రాభివృద్ధికి ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నామని, అందుకు పలు పథకాల కింద రూ. 102 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీలోని 15వార్డుల్లో బుధవారం టియుఎఫ్ఐడిసి నిధులు రూ. 15కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు పురపాలక చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, కౌన్సిలర్లతో కలిసి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంఖుస్థాపన కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు శంఖుస్థాపన కార్యక్రమాలు పండువగా జరిగాయి. ఈసంధర్బంగా జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి సమిష్టిగా ఒకే ఎజెండాతో అభివృద్ధికి పాటుపడాలన్నారు. నూతనంగా ఏర్పడిన ఆమనగల్లు మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచి రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. టియుఎఫ్ఐడిసి నిధుల నుండి మంజూరైన రూ. 15కోట్లను ఆమనగల్లు సురసముద్రం చెరువు మినీట్యాంక్‌బండ్ సుందరీకరణకు రూ.2.50కోట్లు, పట్టణంలో మూడు పార్కుల నిర్మాణం కొరకు రూ. 2.10 కోట్లు, గాంధీచౌక్ నుండి సురసముద్రం చెరువు వంతెన వరకు సైడ్ లైటింగ్ రూ. 50లక్షలు, అంతర్గత మురుగుకాలువలకు రూ. 2.80 కోట్లు, అన్ని వార్డులలో సిసి రోడ్ల నిర్మాణాలకు రూ.7.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. దీంతోపాటు రూ. 2.50కోట్లతో ప్రభుత్వ కళాశాల భవనం నిర్మాణం , రూ.1.50కోట్లతో మాడల్ గ్రంథాలయం, రూ.4.50కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం, రూ. 2కోట్లతో సేవాలాల్ భవన నిర్మాణం, రూ. 50లక్షలతో సామాజిక భవన నిర్మాణాలు, రూ.1కోటితో ధోబీగాట్ల నిర్మాణాల అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. అంతేకాకుండా రూ. 37కోట్లతో తలకొండపల్లి నుండి ఆమనగల్లు సందబావి వరకు రోడ్డు విస్తరణ, రూ. 32 కోట్లతో మిషన్ భగీరథ పనులు, రూ. 22లక్షలు రెండవ కోర్టు భవనాల మరమ్మత్తులు, రూ. 2కోట్లతో పట్టణంలోని బిసి వసతి గృహం భవనంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు నిధులు వ్యయం చేయనున్నట్లు ఆయన వివరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోనే అతి ముఖ్యమైన ఆమనగల్లు పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. స్థాయి పెరిగిన ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రికి నూతన భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. డివిజన్ కార్యాలయాల ఏర్పాటుతో ఆమనగల్లుకు పూర్వ వైభవం తీసుకు రావడానికి పాటుపడుతున్నట్లు ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలను కలుపుకుని వ్యవసాయశాఖ డివిజన్ కార్యాలయం మంజూరైందని, త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. అంతేకాకుండా ఆమనగల్లు మండలం మీదుగా ఆర్‌ఆర్‌ఆర్ రహదారి మంజూరు కావడంతో పరిశ్రమలు ఏర్పడి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రస్తుతం ఆమనగల్లులో వంద కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పాలకవర్గం కోరిక మేరకు ఆమగనల్లు మున్సిపాలిటీకి నూతన భవన నిర్మాణ ఆవశ్యకతను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి నిధులు మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు సమప్రాధాన్యతనిచ్చి అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతామన్నారు. దశల వారీగా ఆమనగల్లు అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని, అందుకు అందరూ సమిష్టిగా కలిసిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు జిల్లా గ్రంథాలయసంస్థ డైరెక్టర్ కమటం రాధమ్మవెంకటయ్య, సభావట్ కృష్ణ,సుజాతరాములు, విక్రమ్‌రెడ్డి, దుడ్డు కృష్ణయాదవ్,గోరటి జ్యోతినర్సింహ్మా,సుండూరి ఝాన్సిచంద్రశేఖర్, చెక్కాల లక్ష్మణ్, దివ్య శ్రీకాంత్‌సింగ్, తల్లోజు విజయ్ కృష్ణ,బైకని యాదమ్మ శ్రీశైలంయాదవ్, చెన్నకేశవులు, సోనజయరాం నాయక్, నాయకులు భారాసా మండల అధ్యక్షులు పొనుగోటి అర్జున్‌రావు, చుక్క నిరంజన్‌గౌడ్, కమటం వెంకటయ్య, సయ్యద్ ఖలీల్, ఎండి మాసూమ్, జయరాంనాయక్, ఎంగలి బాలకృష్ణ, ఎంగలి రఘు, టి. రామకృష్ణ, గోరటి నర్సింహ్మా, శ్రీకాంత్‌సింగ్, సుండూరి చంద్రశేఖర్, జంతుక కిరణ్, పూసలి భాస్కర్, తోట కృష్ణ, మొక్తాల వెంకటయ్య, కోట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


13వ వార్డులో చైర్మన్ రాంపాల్, వైస్ చైర్మన్ దుర్గయ్య, ప్రజాప్రతినిధులతో కలిసి పనులకు శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## ఉప్పరిపల్లిలో ఘనంగా శ్రీపెద్దమ్మ తల్లి విగ్రహా ప్రతిష్ట

**-పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి, భక్తజనం**
**-నూతన ఆలయంలో ప్రతిష్టల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు..బోనాల పండుగ**


ఉప్పరిపల్లిలో శ్రీపెద్దమ్మ తల్లి నూతన ఆలయంలో అమ్మవారి విగ్రహా,ధ్వజస్థంభ ప్రతిష్టలు,పాల్గొని దర్శించుకున్న రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి, ఆలయ నిర్వాహకులు, తదితరులు


శ్రీపెద్దమ్మతల్లి నూతనంగ నిర్మించిన ఆలయం, ప్రతిష్టల సందర్భంగ పూజలు జరిగిన దృశ్యం

**శామీర్‌పేట, మే 17, ప్రభాతవార్త**

ఉప్పరిపల్లి గ్రామంలో నిర్మించిన శ్రీపెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహా ప్రతిష్ట, ఆలయం ప్రాంగణంలో ధ్వజస్థంభ ప్రతిష్ట కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు ఘనంగ జరిగాయి. బుధవారం ఉదయం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని ఉప్పరిపల్లి గ్రామంలో శ్రీపెద్దమ్మ తల్లి అమ్మవారి విగ్రహా ప్రతిష్ట, ధ్వజస్థంభ ప్రతిష్ట కార్యక్రమాలు శ్రీపెద్దమ్మ తల్లి సేవా సమితి వారితో పాటు గ్రామ ప్రజల, దాతల చేయూతతో పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగ జరిగాయి. ఆలయంలో యంత్రం, విగ్రహా ప్రతిష్ట, అమ్మవారికి ఒడిబియ్యం పోసే కార్యక్రమం జరిగింది. ఆ తరువాత ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఉప్పరిపల్లి గ్రామ ప్రజలతో పాటు వివిధ గ్రామాల ప్రజలు, భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మూడు రోజుల నుంచి నూతనంగ నిర్మించిన ఆలయంలో శ్రీపెద్దమ్మ తల్లి విగ్రహా ప్రతిష్ట, ధ్వజస్థంభ ప్రతిష్ట కార్యక్రమాలను పురస్కరించుకుని శ్రీపెద్దమ్మ తల్లి సేవా సమితి వారి ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు యజ్ఞహోమం కార్యక్రమాలను నిర్వహించారు. ఉప్పరిపల్లి గ్రామంలో శ్రీపెద్దమ్మ తల్లి పండుగ సందర్భంగ బుధవారం సాయంత్రం ఆ గ్రామ ప్రజలు బోనాలు చేసి అమ్మవారికి భక్తులు మహిళలు సమర్పించారు. ఉప్పరిపల్లిలో పండుగ వాతావరణం నెలకొని భక్తిపారవశ్యంతో భక్తజనం ఉండి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగ శ్రీపెద్దమ్మ తల్లి విగ్రహా, ధ్వజస్థంభ ప్రతిష్ట సందర్భంగ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సిహెచ్ మల్లారెడ్డి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మంత్రితతో పాటు పలువురు నాయకులను, ప్రజాప్రతినిధులను, వేదపండితులు, బ్రాహ్మణోత్తములను ఆలయ సేవా సమితి వారు సన్మానించి సత్కరించటం జరిగింది. సుమారు గత మూడు సంవత్సరాల నుంచి నూతన ఆలయ నిర్మాణం పనులు గ్రామ ప్రజల, దాతల చేయూతతో పూర్తి చేసి శ్రీపెద్దమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించటం జరిగింది. ఆలయం ముందు ధ్వజస్థంభ ప్రతిష్ట కూడ జరిగింది. ఆలయ నిర్మాణ పనులు చేపట్టిన నాటి నుంచి ప్రతి బుధవారం రోజున దాతల చేయూతతో గత మూడేళ్ల నుంచి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. అమ్మవారి విగ్రహా ప్రతిష్టల సందర్భంగ ప్రత్యేక పూజలు నిర్వహించి మూడు రోజుల పాటు ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ సేవాసమితి వారు నిర్వహించారు.

## దేవాలయాల అభివృద్ధికి కృషి

### -మంత్రి మల్లారెడ్డి


నర్సంపల్లి గ్రామంలో శ్రీ మహంకాళి ఆలయంలో విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి

**కీసర,మే17,ప్రభాతవార్త:**

రాష్ట్రంలోని అన్ని దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు.బుధవారం నర్సంపల్లి గ్రామంలో శ్రీ మహంకాళి ఆలయంలో విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి మల్లారపు ఇందిర లక్ష్మీనారాయణ,సర్పంచ్ సనాల సత్తమ్మ,బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి,ఉపసర్పంచ్ స్వప్న శ్రీనివాస్ రెడ్డి,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### అన్నదానం మహగొప్పది : సుధాకర్ రెడ్డి

అన్నదానం మహగొప్పదని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి అన్నారు. బుదవారం నర్సంపల్లి గ్రామంలో బొడ్రాయి పండుగ సందర్భంగా మూడు రోజులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన సుధాకర్‌రెడ్డిని జడ్పి వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.ఈ సందర్బంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నర్సంపల్లి గ్రామస్తులకు ఒక సేవ చేయాలనే ఆలోచనతో ఈ మూడు రోజులు అన్నదానం చేయడం జరిగిందన్నారు.అన్నదానం చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సనాల సత్తమ్మ,ఉపసర్పంచ్ స్వప్న శ్రీనివాస్‌రెడ్డి,వార్డు సభ్యులు వేణుగోపాల్,క్రిష్ణ,మల్లేష్,శేఖర్,సంజీవకుమార్,ఉపేందర్‌చారీ,సనాల సదదాశివ చారీ,గ్రామ పెద్దలు బల్వంత్‌రెడ్డి,బండారి క్రిష్ణ,నారాయణ,కటికె నర్సింహ్మా,కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మొరుగు రవీందర్,మండల బిఆర్ఎస్ పార్టీ మీడియా అధ్యక్షులు గోరంటి ప్రవీణ్,బిఆర్ఎస్ యువ నాయకులు తుడుం శ్రీనివాస్,రామిడి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యపై పోలీసులకు ప్రజలు సహకరించాలి

### -సైబరాబాద్ కమిషనర్ స్టీఫేన్ రవీంద్ర సూచన

**చేవెళ్ల, మే 17, ప్రభాతవార్త**

ట్రాఫిక్ పోలీసులు నిత్యం అందుబాటులో ఉండి ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని, ప్రజలు పోలీసులకు ట్రాఫిక్ సమస్యపై సహకరించాలని సైబరాబాద్ కమీషనర్ స్టీఫేన్ రవీంద్ర సూచించారు. బుదవారం గచ్చిబౌలి జంక్షన్,ఐకియా,క్యూ మార్ట్, రెడిస్సన్, కొత్తకూడ జంక్షన్ మైండ్ స్పేస్ సైబర్ టవర్స్ మార్గాలలోని ట్రాఫిక్‌ను పరిశీలించారు. ఈ సందర్బంగా సైబరాబాద్ కమీషనర్ స్టీఫేన్ రవీంద్ర మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు.గచ్చిబౌలిలోని ఎస్ఆర్‌డిపి ఫ్లైఓర్ పనులను జరుగుతున్నందున పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లింపు చర్యలు తీసుకున్నామని, ప్రజలు గమనించి పోలీసులకు సహకరించాలన్నారు.రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి, చేవెళ్ల, మొయినాబాద్,గండీపేట్ మండంలోని ప్రజలతోపాటు నగరంలోని పలు ప్రాంతాల ప్రజలు ఎక్కువగా వస్తుంటారని, ట్రాఫిక్‌పై అవగాహనతో పోలీసులకుసహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ సీపీ నారాయణ,ట్రాఫిక్ డిసిపి హర్షవర్దన్ మాదాపూర్ లాఅండ్ అర్డర్ డిసిపి శిల్పవల్లి,ఏడిసిపిలు నంద్యాల నర్సింహరెడ్డి,ట్రాఫిక్ ఏడిసిపి శ్రీనివాస్ రెడ్డి,మాదాపూర్ ఎసిపి రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


కొత్తగూడ జంక్షన్‌లో ట్రాఫిక్‌ను పరశిలిస్తున్న సైబరాబాద్ కమిషనర్ స్టీఫేన్ రవీంద్ర

## నకిలీ విత్తనాలు అమ్మితే పిడి యాక్ట్ నమోదు చేస్తాం

### -జిల్లా ఎస్పీ కోటిరెడ్డి




**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

నకిలీ విత్తనాలు అమ్మితే పిడి యాక్ట్ నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి పేర్కొన్నారు.బుధవారం జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టుటకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు పోలీస్ అధికారులతో కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేశారు.ఈ సందర్బంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...జిల్లాలో నకిలీ విత్తనాల వ్యాపారులకు సహాయం చేసిన వారిపైన కఠినమైన చర్యలు తీసుకొని పిడి యాక్ట్‌లు నమోదు చేస్తామని,నకిలీ విత్తనాలపైన కఠినమైన చర్యలు తీసుకోవడానికి జిల్లాలో పోలీస్ అధికారులు మరియు వ్యవసాయ శాఖ అధికారులు కలసి టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు ఏర్పాటు చేయడం జరిగింది.జిల్లా వ్యాప్తంగా డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ టీమ్ పరిగి,తాండూర్,వికారాబాద్ సబ్ డివిజన్‌ల వారీగా సబ్ డివిజన్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు ఏర్పాటు చేయడం జరిగుతుందన్నారు.ప్రతి ఒక్క రైతుకు నకిలీ విత్తనాలపైన అవగాహన కల్పించడమే లక్ష్యం పని చేయాలని రైతులు విత్తనాలను లైసెన్సు ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు.కొనుగోలు చేసిన అనంతరం తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు.ఎవరైనా కల్తీ విత్తనాలు విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని,అమాయక,పెద రైతులే లక్ష్యంగా మాయ మాటలు చెప్పి మోసపూరిత వ్యక్తులు నకిలీ విత్తనాలు అమ్మి వాళ్ల లాభలను గడించి రైతులను నట్టేట ముంచుతారు అనే విషయాన్ని జిల్లా రైతు మిత్రులు దృష్టిలో ఉంచుకొని విత్తనాల కొనాలని రైతులు కూడా నకిలీ విత్తనాలపైన అవగాహన పెంచుకొని నకిలీ విత్తనాల జాడ తెల్సిన,అట్టి వ్యాపారం చేసే వారు తెల్సిన పోలీస్ అధికారులకు ,వ్యవ శాఖ అధికారులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్,వికారాబాద్ డిఎస్పీ సత్యనారాయణ,పరిగి డిఎస్పీ కరుణా సాగర్ రెడ్డి,తాండూరు డిఎస్పీ శేఖర్ గౌడ్,ఏడిఏలు వికారాబాద్ వినోద్ కుమార్,కొండగల్ శంకర్ రథోడ్, తాందూరు రుద్ర మూర్తి,పరిగి లక్ష్మి కుమారి,జిల్లా ఇన్స్‌పెక్టర్ అధికారులు,ఇతర వ్యవసాయ శాఖ అధికారులు,జిల్లా ఎస్‌హెచ్‌ఓ అధికారులు.సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

### రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ఘట్‌కేసర్, మే 17, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓవ్యక్తి మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఉదయం 11:26 గంటలకు ఘట్‌కేసర్–బీబీనగర్ రైల్వేస్టేషన్ల రెండు రైల్వే ట్రాక్‌ల ఓవ్యక్తి మృతదేహం పడిఉండగా రైల్వేపోలీసులకు సమాచారం రాగా సికింద్రాబాద్ జిఆర్‌పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పరిశీలించి పంచనామా చేశారు. మృతుని వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎత్తు 5.6 అడుగులు ఉంటాడని, ఎదపై పుట్టుమచ్చ ఉందని పోలీసులు తెలిపారు. రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టగా తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడని పేర్కొన్నారు. మృతుని ఆచూకి తెలిసిన వారు సెల్ నంబర్ 9440627514కు సంప్రదించాలని పోలీసులు సూచించారు. ఈ మేరకు మృతదేహానికి గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టమ్ నిర్వహించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు.

## మేడ్చల్ పట్టణంలో జూన్ 6,7తేదీల్లో ఎఐటియుసి మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర 3వ మహాసభలు

**-మంత్రి మల్లారెడ్డిని కలిసిన నాయకులు**
**-విజయవంతం కోసం జిల్లా వ్యాప్తంగా ప్రచారం**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి మే 17, ప్రభాతవార్త**

ఎఐటియుసి మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర 3వ మహాసభలు జిల్లాలోని మేడ్చల్ పట్టణంలో జూన్ 6,7 తేదీల్లో నిర్వహిస్తున్నందున జిల్లా వ్యాప్తంగ ఎఐటియుసి కార్మిక నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధవారం ఈ సందర్భంగ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డిని, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందలను నాయకులు కలిసి మహాసభల కరపత్రాలను అందజేసి మహాసభల విజయవంతానికి సహకరించాలని కోరటం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగ మహాసభలను విజయవంతం చేయటానికి ముమ్మరంగ ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్,ఔట్‌సోర్సింగ్, వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు కె.యేసురత్నం, మందా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగ కార్మిక సిబ్బంద పక్షాన ప్రభుత్వంపై పోరాటాలు నిర్వహిస్తూ 10వ పిఆర్‌సి, 11పిఆర్‌సి జిఓ నెంబరు 14 వేతనాలు పెంపు కోసం, అదే విధంగ సిబ్బంది విధి నిర్వాహణలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటంలో పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రవిచంద్ర, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు డా.రాములు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి అందరం కృషి చేద్దాం

**-తరగతి గదులను పరిశీలించిన జడ్పీవైస్ చైర్మన్**



నందిగామ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జడ్పీవైస్ చైర్మన్

**నందిగామ మే17,ప్రభాతవార్త :** విద్యాభివృద్ధికి పార్టీలకతీతంగా అందరం కృషి చెద్దామని పది ఫలితాల్లో వెనకబడడంపై ఉపాధ్యాయులపై నిందలు వేయడం సరికాదని జడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్ అన్నారు.బుధవారం మండల కేంద్రమైన నందిగామ లో మన ఊరు -మన బడి పథకం నిధులతో నిర్మిస్తున్న ప్రాథమికోన్నత పాఠశాల అదనపు తరగతి గదులను సర్పంచ్ జిల్లెల వెంకట్ రెడ్డితో కలిసి పరిశీలించారు.వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేలోపల పనులన్ని పూర్తికావాలని కాంట్రాక్టర్ బిక్షపతికి సూచించారు.నందిగామ హైస్కూల్,ప్రైమరీ స్కూల్‌లలో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ కృషి మరవలేనిదన్నారు.అన్ని హంగులతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతామన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఈశ్వర్,విద్యాకమిటీ చైర్మన్ రాములు,నాయకులు చెన్నయ్య,మల్లేష్,యాదగిరి తదితరులున్నారు.

## రాష్ట్ర మత్స్యసహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌గా రవీందర్

**-అభినందనలు తెలిపిన జడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్**

**నందిగామ మే17,ప్రభాతవార్త :** తెలంగాణ ఉద్యమకారుడు ,మత్స్యరంగ నిపుణుడు పిట్టెల రవిందర్‌ను తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌గా పిట్టెల రవిందర్ ,వైస్ చైర్మన్‌గా గంగపుత్ర సంఘాల సీనియర్ నాయకుడు దీటి మల్లయ్య నియామకం పట్ల జడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.సమర్థవంతమైన నాయకులకు పదవులు కట్టబెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల స్ఫూర్తి ప్రధాత సిఎం కెసిఆర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆయన ఆకాంక్షించారు.

# నూతన వసతి గృహాలు ప్రారంభం



రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో వసతి గృహాలను ప్రారంభిస్తున్న దృశ్యం

**శంషాబాద్ మే17,ప్రభాతవార్త :** శంషాబాద్ మండలంలోని ఘన్సీ మియాగూడ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన వసతి గృహాలను దాత కొత్తూరు శ్రీదేవి సత్యనారాయణ గుప్తా,దేవాలయ కమిటీ చైర్మన్ గుగ్గిళ్ల రామనాథ్ ముదిరాజ్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు.అమ్మవారి ఆలయం ఆవరణలో భక్తులు వంటలు చేసుకోవడానికి బస చేయడానికి వీలుగా దాదాపు 40లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన షెడ్డును లాంఛనంగా ప్రారంభించారు.అనంతరం వాస్తు పూజ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని శ్రీదేవి సత్యనారాయణ గుప్తా దంపతులు నిర్వహించారు.ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.చైర్మన్ రామనాథ్ ముదిరాజ్ మాట్లాడుతూ...ఆలయ అభివృద్ధికి ముందుకు వచ్చిన దాతలను శాలువా పూలమాలతో సన్మానించి ప్రత్యేక పూజలు చేయించడం జరిగిందన్నారు.విశాల హృదయంతో ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న వారి ఆయన అభినందించారు.కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకన్న స్థానిక సర్పంచ్ దేవిక జగన్ గౌడ్,ఎంపిటిసి సభ్యుడు పూసల పాటి యాదయ్య గౌడ్ ,ధర్మకర్తల మండలి సభ్యులు ,జిల్లా వెంకటేష్ ముదిరాజ్ మంచర్ల రాంబాబు కుమ్మరి అనిత వెంకటేష్,తోక మహేందర్ గౌడ్,బండారి యాదయ్య,ఆలయ ప్రధాన పూజారి వైదిక రత్న పగుడాల శ్రీశైలం,పూజారి మల్లిఖార్జున్,సీనియర్ అసిస్టెంట్ మహిపాల్ యాదవ్,మాజీ ఎంపిటిసి గుగ్గిళ్ల కృష్ణా ముదిరాజ్,పవన్,తదితరులు పాల్గొన్నారు.

## సుల్తాన్‌పల్లి గ్రామంలో అభివృద్ధి పనులను పరిశీలించిన పంచాయతీరాజ్ కమిషనర్ రామారావు



**శంషాబాద్ మే17,ప్రభాతవార్త :** సుల్తాన్‌పల్లి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను తెలంగాణ పంచాయతీ రాజ్ కమిషనర్ రామారావు బుధవారం పరిశీలించారు.జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిడిఇఓ ఉష కిరణ్ రెడ్డి,స్థానిక సర్పంచ్,మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దండు ఇస్తారితో కలసి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు.ప్రధానంగా పల్లె ప్రకృతి వనం క్రీడా ప్రాంగణం స్మశాన వాటిక పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వాటిని పరిశీలించారు.చిన్న గ్రామమైనప్పటికి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.పనులను పకడ్బందీగా నిర్వహిస్తేనే ప్రభుత్వం ఆశించిన ఫలితాలు వస్తాయని ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రదీప్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## చెన్నమ్మకు నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు

**తలకొండపల్లి మే17,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ రమేష్ యాదవ్ మాతృమూర్తి చెన్నమ్మ మరణించడంతో ఆమె మృత దేహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి,జడ్పిటిసి వెంకటేష్,ఎంపిపి నిర్మల ,రాఘురాములు,కృష్ణ, నాయకులు నివాళులర్పించారు.అనంతరం రమేష్ యాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు.

## గట్టుఇప్పలపల్లి గ్రామంలో కంటి వెలుగు

**తలకొండపల్లి మే17,ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ జయమ్మ వెంకటయ్య, వైస్ ఎంపిపి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.బుధవారం తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్,వైస్ ఎంపిపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కంటి వెలుగును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ప్రతి ఒక్కరూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలస్వామి,కార్యదర్శి రాఘువేందర్, వార్డు మెంబర్ మహేష్ ,రేణురెడ్డి,కృష్ణయ్య,రాజేందర్,శరత్‌చంద్ర కిషన్,జంగయ్య,అశోక్,డాక్టర్,గ్రామస్థులు పాల్గొన్నారు.



కంటి వెలుగును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

# సిఎం కప్ క్రీడలు చారిత్రాత్మకం



నందిగామలో సిఎం కప్ బహుమతులిస్తున్న ఎంపిపి,తదితరులు



విద్యార్థులకు మెమెంటో అందజేస్తున్న జడ్పీటిసి దశరథ్ నాయక్, ప్రజా ప్రతినిధులు,అధికారులు



సిఎం కప్ ముగింపు కార్యక్రమం సందర్భంగా ఆటల్లో గెలుపొందిన యువతకు ప్రైజ్‌లు అందజేస్తున్న ఎంపిడిఓ శ్రీనివాస్,ఎంపిఓ తేజిసింగ్,ఎంపిటిసి చీరాల రమేష్ తదితరులు.

**నందిగామ మండలంలో**

**నందిగామ మే17,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేసి సిఎం కప్ క్రీడలు నిర్వహించడం సంతోషించదగినదని నందిగామ మండల ఎంపిపి ఎం.ప్రియాంక శివశంకర్ గౌడ్,జడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్ అన్నారు.గత మూడు రోజులుగా నిర్వహించిన సిఎం కప్ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు ఆమె బహుమతులను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో నందిగామ సర్పంచ్ జిల్లెల వెంకట్ రెడ్డి,ఎంపిటిసిలు కొమ్ముకృష్ణ,దేపల్లే కుమారస్వామి గౌడ్,తహసీల్దారు అబ్దుల్ రహమాన్,ఎంపిపి బాల్ రెడ్డి,ఎంపిఓ గిరిరాజ్,ఎపిఎం యాదగిరి ,హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎ.వి దీనిష్,మామిడి పల్లీ పీఈటి మహిపాల్,ఇమ్రాన్,హారీష్,జె.ఎన్‌వైకె శ్రీశైలం యాదవ్, విద్యా కమిటీ చైర్మన్ జాంగారి రాములు,కో ఆప్షన్ సభ్యుడు ఎండి బెగ్ ఈశ్వర్,మల్లేష్,చెన్నయ్య,యాదగిరి,విజేతలు జెట్టవత్ పరుశరాం ,తదితరులు పాల్గొన్నారు.

**కడ్తాల్ మండలంలో**

**కడ్తాల్,మే 17 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమ్మర్ క్యాంపులో భాగంగా చీఫ్ మినిస్టర్ కప్ 2023 పేరుతో మొదలైన మండలస్థాయి పోటీలు నేటితో ముగిశాయి. కడ్తాల్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా జరిగిన కబడ్డి, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్ విభాగాల నుండి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు మెమెంటోతో పాటు మెడల్స్, సర్టిఫికెట్లను స్థానిక నాయకులతో కలిసి జడ్పీటిసి దశరథ్ నాయక్ చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఇదే విధంగా జిల్లా స్థాయిలో రాణించి కడ్తాల్ మండల పేరును నిలబెట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఆనంద్, ఎంపిడిఓ రామకృష్ణ, తహసీల్దార్ మురళీకృష్ణ, ఏఎస్పై సీతారామ్‌రెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీనరసింహారెడ్డి, తులసిరామ్‌నాయక్, భారతమ్మ విటలయ్య, ప్రధాన ఉపాధ్యాయుడు జంగయ్య,ఉపసర్పంచ్ రామకృష్ణ, రైతు సమితి అధ్యక్షుడు నర్సింహ,కో ఆప్షన్ సభ్యులు బాబా క్రీడాకారుడు యువకులు పాల్గొన్నారు.

**కొందుర్గు మండలంలో..**

**కొందుర్గు, మే 17, (ప్రభాతవార్త) :** క్రీడల్లో పాల్గొన్న యువకులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని మండల పరిషత్ ఉపాధ్యక్షులు రాజేష్ పటేల్ అన్నారు. గత మూడు రోజులుగా స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి సీఎం కప్ 2023 ఆటల పోటీలలో పాల్గొని విజయం సాధించిన క్రీడాకారులను ఆయన బుధవారం నాడు ఎంపీపీ పోతురాజు జంగయ్య, తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎంపీడీఓ ఆంజనేయులు, విండో చైర్మన్ దామోదర్‌రెడ్డిలతో కలిసి బహుమతులను సీఎం కప్‌ను అందజేశారు. కబడ్డీలో విన్నర్ పాత ఆగిర్యాల జట్టు రన్నర్‌గా విశ్వనాథ్‌పూర్ జట్టు, వాలీబాల్‌లో విన్నర్ కొందుర్గు, రన్నర్‌గా తంగేళ్లపల్లి, ఖోఖోలో విన్నర్‌గా కొందుర్గు, రన్నర్‌గా విశ్వనాథ్‌పూర్, 400 మీటర్ల రన్నింగ్‌లో మొదటి బహుమతి పాత ఆగిర్యాల ద్వితీయ వినయ్ ఆగిర్యాల, 100 మీటర్ల రన్నింగ్‌లో మొదటి బహుమతి నిఖిల్ కొందుర్గు, ద్వితీయ అభిషేక్ కొందుర్గులు అందుకున్నారని సీఎం కప్ నిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయులు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు శ్రీధర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, దర్గా సరస్వతి, బాల్‌రాజ్, ఎంపీఓ లాలయ్య,, నాయకులు ఎదిరా రామకృష్ణ, జంగం సతీష్, రాజా రమేష్‌రెడ్డి, భీంసేన్ , ఆకుల మాణయ్య, క్రీడా మాష్టార్లు డాక్టర్ రామచంద్రుడు, డాక్టర్ స్వాములు, పంచాయతీ కార్యదర్శి సురేఖతో పాటు యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఆమనగల్లు మండలంలో..**

**ఆమనగల్లు, మే17, ప్రభాతవార్త:** క్రీడలలో రాణిస్తే సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఆమనగల్లు సిఐ జాల ఉపేందర్ అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడమే కాకుండా దేహధార్యుడ్యానికి దోహదపడుతాయని ఆయన వివరించారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం సాయంత్రం జరిగిన సిఎం కప్ టోర్నీ బహుమతుల ప్రధానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఎంపిపి అనితవిజయ్, జడ్పిటీసీ అనురాధపత్యానాయక్, చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, రైతు బంధు సమన్వయ సమితీ కన్వినర్ నిట్టనారాయణ, ప్రజాప్రతినిధులతో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఎంపిడిఓ ఫారుఖ్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన బహుమతుల ప్రధానోత్సవంలో ముఖ్య అతిథులు ప్రసంగిస్తూ క్రీడల పట్ల ప్రతిఒక్కరూ ఆసక్తి పెంచుకోవాలన్నారు. నేడు క్రీడలు విశ్వవ్యాప్త ఖ్యాతిని పెంచడమే కాకుండా ఆర్థిక బలోపేతానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కూడా ప్రతిభ కల్గిన క్రీడాకారులెందరో ఉన్నారన్నారు.వారిని ప్రోత్సహిస్తే తప్పకుండా ఉన్నత స్థాయిలో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపిఓ శ్రీలత, కౌన్సిలర్ చెన్నకేశవులు, పత్యానాయక్, సోన శ్రీనునాయక్, సరిత పంతునాయక్, రమేశ్‌నాయక్, మంజుల యాదయ్య, పాపిశెట్టి రాము ఉన్నారు.

**మొయినాబాద్ మండలంలో**

**మొయినాబాద్, మే 17, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండల స్దాయిలో జరుగుతున్న సిఎం, కప్ ఆటలపోటీల్లో గ్రామస్దాయిల్లో నుండి ఎంతో మంది యువకులు వారి యొక్క ప్రతిభను కనబరిచారు, మొయినాబాద్ మండలంలో గత 15వ తేది నుండి సిఎం కప్ పేరుతో మండల ఎంపీపీ నక్షత్రం జేవంత్ అధ్యక్షతన ఈ ఆటల పోటీలు జోరుగా జరిగాయి, మండలంలోని ఆయా గ్రామాల నుండి పెద్ద ఎత్తున ఆటగాళ్లు పోటిపడినారు, బుదవారంతో ఆటలపోటీలు ముగిసాయి, ఎంపీడివో కార్యాలయంలో ఆటలపోటీల్లో పాల్గోని విజేతలుగా నిలిచిన వారికి జెడ్పిటీసి కాలే శ్రీకాంత్, ఎంపీపీ నక్షత్రం జేవంత్, సర్పంచ్ స్వరూపా ఆంద్రూస్, ఎంపీడివో సంధ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు, 100 మీటర్ల పరుగు పందెంలో మండలంలోని చిల్కూర్ గ్రామానికి చెందిన కాడిగళ్ల ప్రణేయ్ కుమార్, అత్యుత్తమ ప్రతిభను కబరిచాడు, 12 సెకండ్‌లల్లో 100 మీటర్ల పరుగు పందెంను పూర్తి చేసి సత్తా చాటుకున్నాడు, పరుగు పందెంలో మండలం నుండి ఆయా గ్రామాల యువకులు 12 మంది పోటీ పడగా అందరికంటే ముందుగా పరుగెత్తి, 12 సెకెండ్లల్లో గమ్యాన్ని చేరుకున్నాడు, ప్రణేయ్ కుమార్, మొదటి స్థానంలో నిలువగా, రెండో స్దానంలో కేత్తిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన భరత్, నిలిచారు,ఈ కార్యక్రమంలో జెడ్పిటీసి కాలే శ్రీకాంత్, ఎంపీపీ నక్షత్రం జేవంత్, చిల్కూర్ సర్పంచ్, స్వరూపా ఆంద్రూస్, ఎంపీడివో సంధ్య, ఎం.ఈ.వో వెంకటయ్య, తధితరులు పాల్గోన్నారు.



కొందుర్గులో గెలుపొందిన జట్టుకు బహుమతిని అందజేస్తున్న నాయకులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



పరుగు పందెంలో గెలిచిన ప్రణేయ్ కుమార్‌కు బహుతులు అందజేస్తున్న నాయకులు, అధికారులు

# బ్యాంకు రుణాలపై రైతులకు అవగాహన ఉండాలి

**-రైతులకు అనేక రకాల రుణాలు అందిస్తున్నాం**
**-ఎస్‌బిఐ రీజినల్ చీఫ్ మేనేజర్ నరేంద్రనాథ్‌రెడ్డి**

**చేవెళ్ళ మే 17, ప్రభాతవార్త**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ శాఖ అధ్వర్యంలో రైతులకు అనేక రకాల బుణాలను అందిస్తున్నామని, రైతులు బ్యాంకు రుణాలపై అవగాహన కల్గిఉండాలని ఎస్‌బిఐ రీజినల్ చీఫ్ మేనేజర్ నరేంద్రనాథ్‌రెడ్డి సూచించారు.బుదవారం చేవెళ్ల ఎస్‌బిఐ బ్రాంచ్‌లో బ్యాంకు రుణాలపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బిఐ రీజినల్ చీఫ్ మేనేజర్ నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్‌బిఐలో రుణాలు తీసుకున్న రైతులకు అనేక రకాల బేనిఫిట్స్‌ను కల్పిస్తుందన్నారు. రైతులు వెస్తున్న పంటలు, పంట రుణాలు తీసుకుని సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు. పంట రుణాలతో పాటు రైతులకు పాలిహౌజ్‌లు ఏర్పాటు చేసుకునేందుకు సైతం బ్యాంకు రుణాలిస్తుందన్నారు. వ్యవసాయ రంగంకు అవసరమైన పనిముట్లను కొనుగోలు చేసేందుకు రుణాలందించేందుకు బ్యాంకులు సిద్దంగా ఉందన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలను తీసుకుని సక్రమంగా ఉపయోగించుకుని లబ్దిపోంది తిరిగి బ్యాంకు రుణాలను చెల్లించాలన్నారు. బ్యాంకు సేవలను నిత్యం రైతులు వాడుకోవాలన్నారు. రైతులకు సేవలందించేందుకు బ్యాంకు సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారన్నారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో చేవెళ్ల బ్రాంచ్ మేనేజర్ శ్రీశైలా,చేవెళ్ళ ఫీల్డ్ అఫీసర్ అరున్‌కుమార్, బ్యాంక్ అధికాధి సనాఆఫ్రీన్,చేవెళ్ల బ్యాంక్ సర్వీస్ మేనేజర్ జి.కమలా,రిలేషన్‌షిప్ మేనేజర్ నవీన్‌కుమార్, క్యాషియర్ సాయిప్రణీత్,క్లర్క్ సుదాకర్,సింగిల్ విండో అధికారి విష్ణు,సిబ్బంది మల్లయ్య,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల ఎస్‌బిఐ బ్యాంకులో రైతు అవగాహన సదస్సును నిర్వహించిన ఎస్‌బిఐ రీజినల్ చీఫ్ మేనేజర్ నరేంద్రనాథ్‌రెడ్డి,ఎస్‌బిఐ చేవెళ్ల బ్రాంచ్ మేనేజర్ శ్రీశైలా,చేవెళ్ళ ఫీల్డ్ ఆఫీసర్ అరున్‌కుమార్

## ప్రతి ఒక్కరూ జీవిత బీమాను తప్పనిసరిగా చేయాలి

**-చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**



బీమా చెక్కును అందజేస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, మే 17, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ జీవిత బీమాను చేయాలని, కుటుంబ భద్రత కోసం జీవిత పాలసీని చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు.బుధవారం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేవెళ్ల బ్రాంచ్ ద్వారా రూ.10,95,750 బీమా చెక్కును ఇటీవల మరణించిన పోలేపల్లి బచ్చన్న బార్య పోలేపల్లి వెంకటమ్మకు అందజేశారు.ప్రతి నెల కుటుంబానికి 4500 రూపాయల చోప్పున పెన్షన్‌ను అందజేయనున్నారు.ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ జీవిత బీమా పాలసీ చేయడం వలన కుటుంబానికి ఎంతో మెలు జరిగిందన్నారు. పాలసీ చేయడం వలన కుటుంబానికి రూ.18,51,750 లబ్ది చేకురిందన్నారు.పాలసీ చేయడం మూలంగా కుటుంబాలకు ఎంతోమెలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపిపి మల్గారి విజయలక్ష్మి,మండల పార్టీ అద్యక్షుడు ప్రభాకర్,మండల యుత్ అద్యక్షుడు చంద్రశేఖర్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,డీజీఎం నరేందర్,ఆర్‌ఎం శ్రీనివాస్, ఏరియా మేనేజర్స్ హనుమంతు, సత్యనారాయణ,సురేష్,ఎంప్లాయిస్ హర్షవర్దన్,రమేష్, నవీన్,డివోఎస్ శ్రీశైలం,జనార్దన్, అశోక్,హరిశ్వర్‌రెడ్డి, హైమత్, ఎస్ఓలు తిరుపతి,ప్రవీణ్,అనిల్,యాదయ్య,అంజయ్య పాల్గోన్నారు.

## బిఆర్ఎస్ యువ సమ్మేళనం విజవంతం చేయండి



మాట్లాడుతున్న మంచాల మండలం యువజన విభాగం అధ్యక్షులు వనపర్తి బధీనాథ్ గుప్త

**ఇబ్రహీంపట్నం, మే 17, ప్రభాతవార్త:** ఈ నెల 20న జరగబోయే బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ యువ సమ్మేళాన్ని విజయవంతం చేయాలని మంచాల మండలం యువజన విభాగం అధ్యక్షకార్యదర్శులు వనపర్తి బధీనాథ్ గుప్త,గంట విజయ్‌లు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.బుధవారం మండలం కేంద్రంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథితులుగా మండల అధ్యక్షకార్యదర్శులు చీరాల రమేష్, బహదూర్‌లు హజరై మాట్లాడారు...ఈ నెల 20న ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో జరగబోయే యువసమ్మేళనం కార్యక్రమానికి యువత పెద్ద హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నూతనగంటి శేఖర్, కసమోని మహేతతందర్,ప్రవీణ్ రెడ్డి,విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఆంగోత్ ప్రవీణ్, కొంకాని విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిపై ప్రశ్నిస్తే దాడులు చేస్తారా ?

**కీసర,మే17,ప్రభాతవార్తః**

కీసర సర్పంచ్ నాయకపు మాధురి గ్రామ పంచాయతీలో చేసిన అవినీతిపై ప్రశ్నిస్తే బిజెపి గ్రామ శాఖ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌రెడ్డిపై దాడులు చేస్తారా అని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి ప్రశ్నించారు.బుధవారం కీసర గ్రామ పంచాయతీ నిధులలో అవినీతి జరిగిందని ప్రధాన చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.అనంతరం విలేఖరులతో వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో గ్రామ ప్రజలు పన్నులు రూపంలో కోట్లల్లో డబ్బులు చెల్లిస్తూ ఉంటే 26 లక్షల రూపాయలు అవినీతి జరిగిందని ఆర్‌టిఐ చట్టం ద్వారా రిపోర్టు తీసుకుని అవినీతికి పాల్పడిన సర్పంచ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరగా అధికారులు విచారణ చేపట్టి జిల్లా కలెక్టర్‌కి రిపోర్టులు ఇచ్చినా సర్పంచ్‌పై చర్యలు తీసుకోకపోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదన్నారు. గత కొన్ని నెలలుగా అధికారులు ఇచ్చిన రిపోర్టు ఆధారంగా న్యాయం కోసం పోరాటం చేయడం జరుగుతుందన్నారు.గ్రామ సభలో గ్రామ శాఖ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌రెడ్డి అవినీతిపై ప్రశ్నిస్తే సర్పంచ్ భర్త అనుచిత మాటలు,బూతులు తిట్టడం ఏమిటని అన్నారు.సర్పంచ్ భర్తతో తనకు ప్రాణహాని ఉందని ఈ విషయమై సర్పంచ్ భర్త నాయకపు వెంకటేష్‌పై కీసర పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.బిజేపి పార్టీ అవినీతిపై పోరాడి ప్రజల పక్షాన నిలబడుతుందని అన్నారు. డిఎల్‌పిఓ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా సర్పంచ్‌పై చర్యలు తీసుకునే వరకు బిజెపి పార్టీ పోరాటం చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో బోగారం ఎంపిటిసి సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి,మండల అధ్యక్షులు దేశం మల్లేష్‌గౌడ్,మండల ప్రధాన కార్యదర్శి కోల బాలరాజు,నాయకులు నల్ల వెంకట్‌రెడ్డి,రాగుల అశోక్,మల్లేష్,క్రిష్ణ పాల్గొన్నారు.



కీసర అంబేద్కర్ చౌరస్తాలో విలేఖరులతో మాట్లాడుతున్న బిజేపి నాయకులు

## పద్మశాలి సంఘాన్ని ఒక్కతాటిపై నిలపడమే లక్ష్యం

**-రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా అధ్యక్షులుగా బొమ్మ అమరేందర్**



రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా అధ్యక్షులుగా బొమ్మ అమరేందర్ నియామక పత్రాన్ని అందుకుంటున్న దృశ్యం

**కీసర,మే17,ప్రభాతవార్తః**

తెలంగాణ రాష్ట్ర 33 జిల్లాల్లో పద్మశాలి సంఘాన్ని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు మీడియా ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలంగాణ రాష్ట్ర మీడియా విభాగం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ అమరేందర్ పేర్కొన్నారు.బుదవారం నారాయణ పద్మశాలి భవనం రాజ్ మోహల్లలో తెలంగాణ రాష్ట్ర 33 జిల్లాల అధ్యక్ష కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అఖిల భారత పద్మశాలి సఘం జాతీయ అధ్యక్షులు కందగట్ల స్వామి,రాష్ట్ర అధ్యక్షులు మచ్చ ప్రభాకర్‌లు తెలంగాణ రాష్ట్ర మీడియా విభాగం అధ్యక్షులుగా బొమ్మ అమరేందర్‌ను ప్రకటిస్తూ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా బొమ్మ అమరేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 33 జిల్లాలలోని 30 లక్షలకు పైగా పద్మశాలి సమాజాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ఒక్కతాటిగా సమైక్యపరిచి పద్మశాలిల ఆత్మగౌరవాన్ని కాపాడటమే లక్ష్యంగా కృషి చేస్తానని పేర్కొన్నారు.చేయూత లేని చేనేత రంగాన్ని జాగ్రత్త పరిచి,చేనేత రంగాన్ని నమ్ముకున్న నేత కార్మిక కుటుంబాలకు భద్రత కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు .రాష్ట్రంలో 30 లక్షలకు పైగా ఉన్న పద్మశాలీలను అన్ని పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణిస్తున్నారన్నారు.ఎలాంటి రాజకీయ ప్రాదాన్యత ఇవ్వడం లేదని,పద్మశాలిలను రాజకీయంగా,ఆర్దికంగా అన్ని రంగాల్లో ప్రాదాన్యత ఇవ్వడం లేదని,పద్మశాలీలను రాజకీయంగా,ఆర్దికంగా అన్ని రంగాల్లో అభివృద్ది చెందే విదంగా చైతన్యవంతం చేయడమే తన లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు అవ్వారి భాస్కర్,33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# సిఎం కప్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

**శామీర్‌పేట, మే 17, ప్రభాతవార్త**

మూడుచింతలపల్లి మండల కేంద్రంలో సిఎం కప్ 2023 ఆటల పోటీలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు మూడుచింతలపల్లి మండల ఎంపిపి వి.హారిక మురళీగౌడ్ బహుమతులను కప్స్‌ను, మెడల్స్‌ను అందజేశారు. బుధవారం మూడు చింతపల్లి మండల కేంద్రంలోని రైతువేధిక భవనంలో సిఎం కప్ వివిధ క్రీడాపోటీల్లో పాల్గొని విజయం సాధించిన విజేతలకు బహుమతులను ఆమె అందజేశారు. మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని క్రీడా మైదాన ప్రాంగణంలో సిఎం కప్ 2023 క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వి.హారికమురళీగౌడ్‌తో పాటు ఎంపిడిఓ వత్సలదేవి,ఎంఇఓ వసంతకుమారి, స్థానిక సర్పంచు జామ్ రవి, ఎంపిటిసి పి.నాగరాజు, మండల కోఆప్షన్‌సభ్యులు గౌస్‌పాష, ఎంపిఓ సునిత, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మూడుచింతలపల్లి మండల కేంద్రంలో సిఎం కప్ క్రీడాపోటీల విజేతలకు బహుమతులను కప్‌లను, మెడల్స్‌ను అందజేసిన ఎంసిపల్లి మండల ఎంపిపి వి.హారికమురళీగౌడ్,పాల్గొన్న సర్పంచులు, ఎంపిటిసిలు, మండల కోఆప్షన్‌సభ్యులు, ఎంపిడిఓ, పలువురు అధికారులు, తదితరులు

# వైభవంగా ఎల్లమ్మ దేవత ప్రతిష్ట

**ఆమనగల్లు, మే17, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని ప్రతిభనగర్ కాలనీలో ఎల్లమ్మతల్లి దేవత విగ్రహ ప్రతిష్ట మహోత్సవం భక్తిశ్రద్దలతో కన్నుల పండువగా వైభవంగా జరిగింది. నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మూడురోజుల పాటు జరిగిన మహోత్సవంలో వివిధ ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరిరోజు బుధవారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఎల్లమ్మతల్లికి పూజలు చేశారు. అనంతరం నిర్వహకులు ఆలయ మర్యాదలతో రాఘవేందర్‌రెడ్డిని స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, జంగయ్య, టిల్లు యాదవ్, అనిల్, అర్జున్, రమేష్, మాజీ సర్పంచు రచ్చ శ్రీరాములు తదితరులు ఉన్నారు.



పూజలు చేస్తున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

